క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సీఎం ఐచ్ఛిక సెలవు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా గజన్‌లాల్, నాయకులు బానోత్ నరేశ్‌నాయక్, గుగులోతు రవిలాల్‌నాయక్, గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు భూక్య రాజునాయక్ తదితరులున్నారు.

'ఆది' గెలుపుతో కాలినడకన ఎములాడకు



నడుస్తూ వెళ్తున్న కట్టలింగంపేట మహిళలు

చందుర్తి: వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలిస్తే కాలినడకన వచ్చి, ఎములాడ రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటామని చందుర్తి మండలంలోని కట్టలింగంపేటకు చెందిన మహిళలు మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో శనివారం గ్రామం నుంచి కాలినడకన ఎములాడకు వెళ్లారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకొని, తిరిగి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యెల్ల విజయ, ఏనుగుల పద్మ, యెల్ల మంజుల, జంగిలి రమ, యెల్ల చైతన్య, తొత్తల్ల సంధ్య, జంగిలి లక్ష్మి, ఆదరవేని మల్లవ్వ, తుమ్మ సంగీత తదితరులున్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

తంగళ్లపల్లి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోడి అంతయ్య అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలంలోని సారంపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి ఠాణాకు తరలింపు



తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేటలో శనివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకున్నారు. అతడిని ప్రశ్నించడంతో తాయత్తులు కట్టడానికి వచ్చానని ఒకసారి, నిమ్మకాయల కోసం వచ్చానని మరోసారి చెప్పడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యుత్ కంచెకు తగిలి గేదె మృతి

రుద్రంగి: రూప్లానాయక్‌తండాకు చెందిన గుగులోతు తిరుపతినాయక్ తన గోధుమ పైరుకు రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కంచె తగిలి ఓ గేదె మృతిచెందింది. అదే తండాకు చెందిన హరిసింగ్ తన గేదెను ఇంటి వద్ద కొట్టంలో కట్టేశాడు. శుక్రవారం రాత్రి తాడు తెంపుకొని, పక్కనే ఉన్న విద్యుత్ కంచెకు తగిలి చనిపోయింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

రెండిళ్లలో చోరీ

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో తాళం వేసిన రెండిళ్లలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మొగులోజు లక్ష్మీరాజం శుక్రవారం అల్మాస్‌పూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. అతని భార్య రాత్రి ఇంటికి తాళం వేసి, పక్కవారి ఇంట్లో నిద్రించింది. దుండగులు తాళం పగులగొట్టి, రూ.50 వేలు, అరతులం బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే, ఇదే ఊరిలో ఒంటరిగా ఉంటున్న చింతల గంగవ్వ తన పక్కవారి ఇంట్లో నిద్రించింది. ఆమె ఇంట్లోనూ చొరబడి, రూ.2 వేలు చోరీ చేశారు.

నేడు ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు తెలిపారు. మొత్తం 8 టీంలకు గాను శనివారం డ్రా తీశారు. మొదటి మ్యాచ్ పోలీసులు, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మధ్య జరుగుతుందన్నారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల 25వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు శనివారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ రవికుమార్, వార్డు ఆఫీసర్ శ్వేత, టీచర్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

చందుర్తి: మండల కేంద్రంలోని క్రీడాకారులకు ఇదే గ్రామానికి చెందిన బొజ్జి భాస్కర్(శ్రీలక్ష్మి సూపర్ మార్కెట్ యజమాని) శనివారం క్రికెట్ కిట్ అందజేశారు. ఆర్థికంగా లేని క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానన్నారు.

ఒక్కో రైస్.. ఒక్కో రుచి

- కిలో నుంచి 25 కిలోల వరకు..
- మార్కెట్లో లభ్యం
- దావత్‌లలో వీటికి ప్రాధాన్యం..
- సువాసనతోపాటు రుచికర అన్నం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు

బియ్యం రకాలు	ధర (రూ.లో)
మట్టావాడి	90
సూర్తికొల్లామ్	90
కాలిముచ్‌చీ	85
నవారా	130
బాస్మతి	80–250
హిమాలయన్	90–150
అందెమొహర్	120
గోవింద్ భోగ్	130
చిట్టిముత్యాలు	120



మార్కెట్లో లభిస్తున్న వివిధ రకాల బియ్యం

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: ఆదివారం వచ్చిందంటే.. ఇంట్లో బిర్యానీ గుమగుమలు, నాన్‌వెజ్, మసాలా రుచి నాలుకకు తగలాల్సిందే. అయినవారు, స్నేహితులతో కలిసి దావత్ చేసుకోవడానికి ఏ రకమైన బియ్యం వాడాలని ఆలోచిస్తుంటారు. ఈ క్రమంలో రొటీన్‌కు భిన్నంగా వివిధ కంపెనీలు కొత్త ఫ్లేవర్స్, సరికొత్త రకాల బియ్యాన్ని మార్కెటింగ్ చేస్తున్నాయి. నవతరం అభిరుచులకు తగ్గట్టుగా వస్తున్న బియ్యంపై సండే స్పెషల్ స్టోరీ.

ప్రత్యేక రోజుల్లో ప్రత్యేకత ఉండాల్సిందే..

ప్రజలు రొటీన్‌కు భిన్నంగా ఆహార రుచులను ఆస్వాదిస్తున్నారు. మనకు లభించే సాధారణ రకం బియ్యంతోపాటు మార్కెట్లో ఎన్నో వెరైటీస్ రైస్ లభ్యమైతున్నాయి. ప్రత్యేక రోజుల్లో తీసుకునే ఆహారంలో కొత్తదనం కోరుతున్నారు. సాధారణంగా పంట బియ్యం, సోనామసూరి, బీపీటీ, జైశ్రీరాం, హంసలు, బాస్మతి వంటివి అందరికీ తెలిసినవే. ప్రస్తుతం మార్కెట్లో వీటికి భిన్నంగా సాధారణ రైస్‌లో స్ట్రీమ్ రైస్, రారైస్, బ్రౌన్ రైస్ వచ్చాయి. ఆవటిలో సవారా, జీరాసాగర్, అరవకట్రాని, కాలిముచ్, సూర్తి కొల్లామ్, దంపుడు బియ్యం, దోశరైస్, ఇడ్లీ రైస్, వడ కొల్లంరైస్, రాయ్‌చూర్, ఎస్‌టీఎం, చిట్టి ముత్యాలు, బాస్మతి, హిమాలయన్ లాంగ్ గ్రెయిన్, అందె మొహర్, గోవింద్ భోగ్ తదితరాలు సిరిసిల్లలో లభ్యమవుతున్నాయి. వీటిని కేజీ ప్యాకెట్ నుంచి 25 కిలోల వరకు విక్రయిస్తున్నారు.

రుచికరం.. ఆరోగ్యం

పాతకాలంలో పెద్దలు పంట ధాన్యాన్ని దంచి, బియ్యంగా మార్చి తినేవారు. తర్వాతి కాలంలో గిర్నీల్లో పట్టించి, ఉనుక, తవుడులను వేరు చేసి, బియ్యాన్ని తీసేవారు. ప్రస్తుతం బియ్యం రెడిమేడ్ వస్తువుగా లభిస్తున్నాయి. లోకల్ బియ్యం రోజు తినేదే కాబట్టి ప్రత్యేక రోజుల్లో కొత్త రుచులతో అన్నం, బిర్యానీ, పులావ్, అల్పాహారం తీసుకోవడానికి ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారు. ఇందుకోసం సరికొత్త రకాల్లో వస్తున్న బియ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటితో రుచితోపాటు ఆరోగ్యాన్ని పొందవచ్చన్న నమ్మకాన్ని ఆయా కంపెనీలు కల్పిస్తున్నాయి. ఫలితంగా మార్కెట్లోకి వెరైటీల్లో బియ్యం, బ్రాండెడ్, అన్‌బ్రాండెడ్ రకాల్లో వస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలోనూ ఇటువంటి బియ్యానికి ఆదరణ పెరుగుతోంది. అన్ని మార్ట్‌లు, సూపర్ మార్కెట్లు, రైస్ డిపోల్లో అందుబాటులో ఉన్నాయి.

బిర్యానీ, పులావ్, కిచిడీకి..

వైస్, బ్రౌన్ బాస్మతి రైస్, హిమాలయన్ లాంగ్ గ్రెయిన్ రైస్‌ను బిర్యానీ, పులావ్‌లకు వాడుతారు. అన్నం సువాసనతో రుచికరంగా ఉంటుంది. మహారాష్ట్రకు చెందిన అందె మొహర్ రైస్ మామిడి పూతలాగా సువాసన వచ్చే పొట్టిరకం బియ్యం. వీటితో సంప్రదాయ వంటలతోపాటు మసాలాబాత్, కిచిడీ చేస్తారు. పశ్చిమబెంగాల్ నుంచి వచ్చే గోవింద్‌భోగ్ బియ్యంతో పాయసం చేస్తారు. పులావ్, కిచిడీకి ఉపయోగిస్తారు. ఇక, చిట్టిముత్యాలు, జీరారైస్ పొట్టిగా ఉండి, సువాసన కలిగి ఉంటాయి. వెజ్, నాన్‌వెజ్ బిర్యానీ, దొన్నె బిర్యానీకి వినియోగిస్తారు. నవారా, జీరాసాగర్, అరవ కట్రా ని, కాలిముచ్, సూర్తి కొల్లామ్, మట్టావాడి రైస్‌లో శరీరానికి కావాల్సిన పోషక విలువలు ఉంటడంతోపాటు ఆహారం సులువుగా జీర్ణమవుతుంది.

ఎన్నో వెరైటీల్లో బియ్యం



మార్కెట్లో ఎన్నో వెరైటీల్లో బియ్యం లభిస్తున్నాయి. సండే వచ్చిందంటే కామన్‌గా నాన్‌వెజ్ కోరుకుంటారు. బిర్యానీ అంటే మరింత ఇష్టపడుతారు. మార్కెట్లో దొరుకుతున్న కొత్త రకాల బియ్యంతో అన్నం సువాసనతోపాటు టేస్టీగా ఉంటోంది. పొట్టిరకం బియ్యంతో చికెన్, మటన్, వెజిటేబుల్ బిర్యానీ, పులావ్ చేస్తే బాగుంటుంది.

ఓరుగంటి వేదశ్రీ, ఉపాధ్యాయురాలు

తక్కువ నూనె వాడొచ్చు



బాస్మతి రైస్‌తో చేసే బిర్యానీ తదితర వంటకాల్లో నూనె ఎక్కువ వాడాలి. కానీ, ఇప్పుడు వస్తున్న కొత్తరకం బియ్యానికి తక్కువ నూనె వాడొచ్చు. ఆరోగ్యంతోపాటు రుచిని పొందవచ్చు. ఇప్పుడు దొరికే రైస్‌లో ఫైబర్, పిండి పదార్థాలు, ప్రొటీన్స్ అధికంగా లభిస్తున్నాయి. ధర కోసం చూడకుండా బ్రాండెడ్ రైస్‌ను వాడటమే మంచిది.

వెగ్గలం రేఖ, గృహిణి

ఎంపీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే మద్దతు

- పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట: రాబోయే ఎంపీ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తారని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్‌లో ఆలిండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు అజ్మీరా భాస్కర్, పలువురు గిరిజన సంఘం నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై ప్రజలకు విశ్వాసం కలిగిందన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి, నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్సీలు, ఎస్టీలు కాంగ్రెస్‌వైపే మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, దమ్మన్నపేట, జగదాంబతండా గ్రామ శాఖ అధ్యక్షులు బలరాంరెడ్డి, విఠల్‌నాయక్, నాయకులు లాల్యానాయక్, బాల్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గంభీరావుపేట మండలంలోని ముస్తఫానగర్‌కు చెందిన సాక్షి కరీంనగర్ ఎడిషన్ ఇన్‌చార్జి ముజఫర్ తండ్రి మున్వర్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పార్టీ మండలశాఖ అధ్యక్షుడు హమీద్, నాయకులు కొక్కు రాజం, అక్బర్, సంజీవ్, ప్రభాకర్, నాంపల్లి, వంశీ తదితరులున్నారు.



పార్టీలో చేరిన నాయకులతో మహేందర్‌రెడ్డి



పూజలు చేస్తున్న కేకే మహేందర్ రెడ్డి

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

సిరిసిల్లటౌన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల శివనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన పట్టణ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్లపాటు ప్రజావ్యతిరేక పాలన సాగించిందని ఆరోపించారు. నాయకులు, కార్యకర్తలు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, నాయకులు బాలరాజు, దేవరాజు, నర్సయ్య, వనిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెల్లలో సీతారాముల కల్యాణం

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్లలో రామునిబండపైన శనివారం శ్రీసీతారాముల కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారిని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పూర్మాణి మంజుల–లింగారెడ్డి దంపతులు, ఎంపీపీ పడిగెల మానస, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌జేటోని, ఎంపీటీసీ సభ్యుడు భైరినేని రాము, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోడి అంతయ్య దర్శించుకున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



తంగళ్లపల్లి: అంబేడ్కర్ యువజన సంఘం తంగళ్లపల్లి నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్యారం పెంటయ్య, ఉపాధ్యక్షుడిగా లింగం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా లింగాల జలంధర్, సహాయ కార్యదర్శిగా లింగం సందీప్, కోశాధికారిగా క్యారం శ్రీనివాస్, సలహాదారులుగా లింగాల భూపతి, క్యారం జగత్ కుమార్, గట్టెపల్లి రత్నయ్య, రమేశ్, ఎరవెల్లి రాజనర్సు ఎన్నికయ్యారు.

గత పాలకవర్గానికి సన్మానం



వేములవాడరూరల్: ఎదురుగట్ల పంచాయతీ కార్యాలయంలో గత పాలకవర్గానికి గ్రామస్తులు శనివారం సన్మానం చేశారు. వీరితోపాటు కానిస్టేబుళ్లుగా ఎంపికైన అదే గ్రామానికి చెందిన గణేశ్, కోడం గంగరాజు, ఎగుర్ల మధు, మాటేటి లావణ్యలను సత్కరించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి, జీపీ కార్యదర్శి శ్యామల, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారికి సత్కారం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో చిరంజీవిని కాంగ్రెస్ నాయకులు శనివారం సన్మానించారు. గ్రామంలో మంచినీటి సమస్య, రోజువారీ మార్కెట్, పాత బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ప్రత్యేకాధికారి స్పందిస్తూ.. గ్రామస్తుల సహకారంతో అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నాయకులు గిరిధర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చాగౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని కోనాయపల్లికి చెందిన వెదిరె గణేశ్‌గౌడ్ కొన్నిరోజులుగా హైఫీవర్‌తో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆయన కుటుంబసభ్యులను శనివారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. బాధితులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు సభ్యులు మధు మహేశ్, డాక్టర్ రవీందర్, తాళ్లపల్లి ప్రశాంత్, గొంగళ్ల రవికుమార్, పొలాస రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గామాత ఆలయ వార్షికోత్సవం



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీదుర్గామాత ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పురోహితుడు రాచర్ల కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ సభ్యుడు చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎలగందుల అనసూయ, వైద్యుడు జి.సత్యనారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు 'భక్త శివ మార్కండేయ' ఉత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: భక్త శివ మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలను ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. సంబంధిత కరపత్రాలను శనివారం సిరిసిల్లలోని పద్మశాలీ సంఘ భవనంలో ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. పద్మశాలీ సామాజిక వర్గ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. పద్మశాలీ సంఘం సిరిసిల్ల అధ్యక్షుడు గోలి వెంకటరమణ, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పద్మశాలీ పెద్దలు గాజుల బాలయ్య, మండల సత్యం, బొల్లి రామ్మోహన్, యెల్లె లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

నేటి వడ్డెర మహాసభకు తరలిరండి



సిరిసిల్లటౌన్: హైదరాబాద్‌లో ఆదివారం జరిగే వడ్డెర మహాసభకు సంబంధించిన పోస్టర్లను సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే మహాసభకు ఒడ్డెర సామాజిక వర్గ ప్రజలు తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పీట్ల వెంకటేశం, దండుగుల తిరుపతి, కొమ్మురాజుల ఐలయ్య, సల్లంగుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటుకు నిధులు



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిషన్‌దాస్‌పేటలో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసింది. దీంతో నాయకులు సబ్ సెంటర్ భవన నిర్మాణానికి శనివారం కిష్టంపల్లిలో స్థల పరిశీలన చేపట్టారు. పనులు పూర్తయితే కిషన్‌దాస్‌పేట, కిష్టంపల్లి వాసులకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాలరాజు, నాయకులు లక్ష్మీనారాయణ, సత్తయ్య, విఠల్‌రెడ్డి, దేవయ్య, సత్యంరెడ్డి, జీడి రాజు, బాలయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు కృషి



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి

ముస్తాబాద్: యాసంగిలో రైతులకు నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు సెస్ కృషి చేస్తుందని సంస్థ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలంలోని నామాపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. రాంరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పోచయ్య, మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రావు, సెస్ సిబ్బంది ఉన్నారు.

శిలాఫలకాల ధ్వంసం అన్యాయం



సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం అన్యాయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చేలా ప్రయత్నిస్తున్న తమ ప్రభుత్వ విధానాలను ఓర్వలేకనే కొందరు ఇతర పార్టీల నాయకులు పనిగట్టుకొని విధ్వంసానికి దిగడం అన్యాయమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అనుచరులే ఇలా చేస్తున్నారని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, గిరిధర్‌రెడ్డి, నాయకులున్నారు.

'పది' పరీక్షలకు ప్రణాళికతో చదవాలి



సిరిసిల్లఎడ్యుకేషన్: పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలకు ప్రణాళికతో చదవాలని మోటివేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పదోతరగతి పరీక్ష సన్నాహక సమీక్ష నిర్వహించారు. పరీక్షలంటే భయపడవద్దని, అవి రోజువారీగా స్కూల్లో రాసిన విధానంలోనే ఉంటాయని తెలిపారు. టీచర్లు బోధించే సమయంలో శ్రద్ధగా వింటే సగం పాఠం అర్థమవుతుందని, దాన్ని మళ్లీ చదవడం వల్ల గుర్తుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై శేఖర్

ముస్తాబాద్: సమాఖ్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ముస్తాబాద్ శాఖ క్యాలెండర్‌ను ఎస్సై శేఖర్ శనివారం ఆవిష్కరించారు. కౌన్సిల్ మండల చైర్మన్ రాచమడుగు శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ.. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. బాధితులకు సాయం చేస్తామని పేర్కొన్నారు. వైస్‌చైర్మన్ కటకం నరేశ్, నాయకులు నవీన్, యాదగిరి, సంతోష్, రాజు, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో దుర్గంధం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలోని చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను తీసుకెళ్లే వాహనం వచ్చిందంటే ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతుందని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శి, మండల పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగైదు నెలలుగా ఈ వాహనం వచ్చి స్థానిక చికెన్ సెంటర్లలోని వ్యర్థాలను తీసుకెళ్తుందన్నారు. ఆ సమయంలో వాహనం నిలిపిన ప్రాంతం దుర్గంధంతో నిండిపోతుందన్నారు. సదరు వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ముస్తాబాద్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్‌ఎస్వీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు మహమ్మద్ నవాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం నామాపూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనంలో కూరలు సరిగా లేవని పేర్కొన్నారు. కోడిగడ్డు అప్పుడప్పుడు ఇస్తున్నారని విద్యార్థులు చెప్పారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పదోతరగతి విద్యార్థులకు గోరుముద్ద ఇచ్చారని, ఇప్పుడు ఎలాంటి అల్పాహారం పెట్టడం లేదని తెలిపారు. నాయకులు ప్రశాంత్, భాను, ఆదిల్, ఆనంద్, ఆది తదితరులు పాల్గొన్నారు.